సాక్షి
పెద్దపల్లి
మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023





సంక్షేమానికి జై

ఉమ్మడి జిల్లాలో 13,200 మందికి దళితబంధు

కాళేశ్వరం టూరిజం సర్క్యూట్‌కు రూ.750 కోట్లు	కరీంనగర్ స్మార్ట్‌సిటీకి రూ.186 కోట్లు
నీటిపారుదల రంగానికి రూ.569 కోట్లకు పైగా ఫండ్స్	వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.50 కోట్లు

ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు రాష్ట్ర ఈక్విటీ కింద రూ.10 కోట్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2023–24లో ఉమ్మడి జిల్లాలో సంక్షేమానికి పెద్దపీట వేసింది. బడ్జెట్‌లో కొత్త పథకాలు ఏమీ లేకపోయినా.. ఇప్పటికే కొనసాగుతున్న పలు పథకాలకు నిధులు దండిగా కేటాయించారు. వ్యవసాయం, సామాజిక సంక్షేమం, సామాజిక భద్రత, నీటిపారుదల, మున్సిపల్, పర్యాటక, ఆధ్యాత్మిక, విద్య, క్రీడా రంగాలకు సముచిత ప్రాధాన్యం కల్పించేలా నిధులు విడుదల చేశారు. ఈ కేటాయింపుల్లో కొన్నింట్లో పెరుగుదల కనిపించగా.. మరికొన్నింట్లో తగ్గుదల నమోదైంది. నీటిపారుదల, శాంతిభద్రతలు, సంక్షేమానికి నిధుల్లో ప్రాధాన్యం కనిపించింది. ముఖ్యంగా రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్ వంటి పథకాలకు ఎప్పటిలాగే పెద్దపీట వేయగా.. ఎన్నికల సంవత్సరం కావడంతో రైతుల కోసం నీటిపారుదల రంగానికి నిధులు పెంచారు. అలాగే.. దళితబంధుకు సైతం నిధుల్లో మంచి భాగస్వామ్యాన్నే కల్పించారు. పురపాలికలకు ఆర్థిక సాయం, స్మార్ట్‌సిటీలకు నిధుల్లోనూ పెద్దపీటే వేశారు. సొంతింటికి రూ.3 లక్షల ఆర్థిక సాయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నియోజకవర్గానికి 1,100 మందికి..



తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకం దళితబంధు. ప్రతీ దళితులను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను మార్చాలన్న ఉద్దేశంతో హుజూరాబాద్‌లో విజయవంతంగా అమలు చేశారు. ఉమ్మడి జిల్లాలో మిగిలినవి 12 నియోజకవర్గాలు. గతంలోలాగా నియోజకవర్గానికి 100 మందికి పరిమితం కాకుండా ఈసారి 1100 మంది చొప్పున ప్రభుత్వం సాయం ప్రకటించనుంది. ఈ లెక్కన 13,200 మందికి పథకాన్ని ఇవ్వనున్నారు. వీరికి ప్రతీ ఒక్కరికి రూ.10 లక్షల చొప్పున దాదాపు రూ.1,320 కోట్ల ఆర్థికసాయం అందించనున్నారు. ఈ పథకం అమలు కోసం గతేడాది దాదాపు రూ.1,800 కోట్లకుపైగా ఒక్క హుజూరాబాద్‌లోనే ప్రభుత్వం యూనిట్ల మంజూరుకు వెచ్చించింది.

సొంతింటికి రూ.3 లక్షలు..



డబుల్ బెడ్‌రూములు ఇప్పటికే జిల్లాల్లో వివిధ దశల్లో నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రారంభానికి దగ్గరగా ఉన్నాయి. అదే క్రమంలో గతంలో ఇచ్చిన హామీ మేరకు స్థలం ఉన్న ప్రతీ అర్హులకు ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల సాయం చేస్తామని ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో స్థలం ఉండి.. ఇల్లు కట్టుకోలేని వారికి ఇది శుభవార్తే. కానీ, నిర్మాణ వ్యయం భారీగా పెరిగిన నేపథ్యంలో రూ.3 లక్షలు ప్రకటనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే ధరపై ప్రభుత్వమే సబ్సిడీపై ఇంటి సామగ్రిని సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు.

పురపాలికలకు కేటాయింపులు ఇలా..



ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లకు ఆర్థిక సాయం కింద రూ.20 కోట్లు ప్రకటించింది. అయితే.. గతేడాది బడ్జెట్‌లో ఈ సాయం రూ.30 కోట్లుగా ఉండగా.. ఈ ఏడాది పద్దులో మాత్రం రూ.10 కోట్లు తక్కువగా కేటాయించారు.

కరీంనగర్ స్మార్ట్‌సిటీకి రూ.186.56 కోట్లు



కరీంనగర్ స్మార్ట్‌సిటీకి ప్రభుత్వం తన వంతు వాటాగా.. ఈ ఏడాది రూ.186.56 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలోని స్మార్ట్‌సిటీలకు మొత్తంగా రూ.373.14 కోట్లు కేటాయించగా.. సగం వరకు కరీంనగర్‌కు కేటాయించడం విశేషం. ఇప్పటికే స్మార్ట్‌సిటీ కింద కేంద్రం నుంచి వచ్చిన నిధులతో జంక్షన్ల సుందరీకరణ, రోడ్లు, ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు తదితర పనులు వేగంగా సాగుతున్నాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో పనులు మరింత వేగం పుంజుకోనున్నాయని మేయర్ సునీల్ రావు తెలిపారు. కేంద్ర రాష్ట్రం 50:50 ప్రాతిపదికన జరుగుతున్న పనుల్లో ఇంతవరకూ రూ.196 కోట్లు తెలంగాణ, మరో రూ.196 కోట్లు కేంద్రం నిధులు ఇచ్చాయి.

నిధులు	కేటాయింపు
కరీంనగర్ స్మార్ట్‌సిటీ	రూ.166.25 కోట్లు
ఎస్సీఎస్పీ కింద	రూ.12.88 కోట్లు
టీఎస్పీ నిధుల కింద	రూ.7.43 కోట్లు
మొత్తంగా స్మార్ట్‌సిటీకి..	రూ.186.56 కోట్లు

క్రీడా స్కూల్ కోసం రూ.8 కోట్లకుపైగా..



ఉమ్మడి జిల్లా ఉజ్వలపార్క్ సమీపంలో ఎల్ఎండీ స్పోర్ట్స్ స్కూల్ కోసం ఈ ఏడాది రూ.16.53 కోట్లు కేటాయించారు. ఈ నిధులను టీఎస్ స్పోర్ట్స్ స్కూల్‌తో కలిసి పంచుకోవాల్సి ఉంటుంది. ఈ లెక్కన రూ.8.2 కోట్ల వరకు నిధులు రానున్నాయి. ఈ నిధులతో స్విమ్మింగ్‌పూల్, జిమ్నాజియం, బాక్సింగ్ ఇండోర్ హాల్, జుడో, రెజ్లింగ్ ప్రత్యేక హాలు, సింథటిక్ ట్రాక్ (మల్టీ పర్పస్ ట్రాక్), కోచ్‌లు, సదుపాయాల ఆధునికీకరణ, హకీంపేట తరహాలో క్రీడాకారులకు డైట్ తరహా సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ఈ రెండు టీఎస్ స్పోర్ట్స్ స్కూళ్లకు కలిపి గతేడాది రూ.19.70 కోట్లు కేటాయించింది.

- ఇక రాష్ట్రవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాలకు రూ.500 కోట్లు కేటాయించింది. ఇందులో ఉమ్మడి జిల్లాలో ఉన్న శాతవాహన వర్సిటీకి ఎన్నినిధులు వస్తాయన్న దానిపై స్పష్టత లేదు.

పర్యాటకానికి ఊతం..



- కాళేశ్వరం టూరిస్ట్ సర్క్యూట్ కింద రూ.750 కోట్లు కేటాయించింది. కాళేశ్వరం దాని అనుబంధంగా ఉన్న పలు ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్ల పరిసరాల్లో పర్యాటకం అభివృద్ధికి ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా గోదావరిఖనిలో బోటింగ్, కనోయింగ్, కయాకింగ్ తదితర క్రీడల అభివృద్ధికి దోహదపడతాయి. ఇక లోయర్‌మానేరు, మిడ్‌మానేరు, అప్పర్ మానేరు రిజర్వాయర్ల పరిసరాల సుందరీకరణ, పర్యాటకులను ఆకట్టుకునేందుకు బోటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసుకునే వీలుంది. ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌లో కోటిలింగాల రేవు వద్ద గోదావరిలో పడవ ప్రయాణం పునఃప్రారంభించేందుకు వీలు చిక్కనుంది.

వేములవాడ ఆలయం అభివృద్ధికి రూ.50 కోట్లు



యాదాద్రి తరహాలో వేములవాడను ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తానని సీఎం గతంలోనే ప్రకటించారు. ఈ మేరకు వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీడీఏ)ను ఏర్పాటు చేసింది. గతంలో రూ.50 కోట్లు ప్రభుత్వం ఇచ్చింది. ఆ నిధులను భూసేకరణకు, జీతభత్యాలకే వినియోగించారు. టెంపుల్ కోసం పలు ఆనంద్‌సాయి, స్థపతి వల్లినాయగం నేతృత్వంలో పలుమార్లు గుడికి వచ్చి.. కొన్ని డిజైన్లు పరిశీలించినా.. ఏదీ ఖరారు చేయలేదు. తాజాగా రూ.50 కోట్లు కేటాయించడంతో దక్షిణకాశీ అభివృద్ధిపై తిరిగి ఆశలు చిగురించాయి.

- చేనేత బీమాకు ఈ బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించింది. ఆకస్మికంగా చేనేత కార్మికులు మరణిస్తే.. వారి కుటుంబాలకు పదిరోజుల్లోగా రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తానని ప్రకటించింది.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు రూ.10 కోట్లు..



- రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్)కు రాష్ట్రం రూ.10 కోట్లు కేటాయించింది. స్టేట్ ఈక్విటీ కింద తన వంతుగా ఈ నిధులు కేటాయించింది.

నీటి ప్రాజెక్టులకు.. రూ.569 కోట్లకుపైగా..!

గతేడాదితో పోలిస్తే.. ఈ ఏడాది సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుల్లో పెరుగుదల నమోదైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు చిన్న, మధ్య, తరహా ప్రాజెక్టుల నిర్వహణకు గతేడాది రూ.451 కోట్లు విడుదల చేయగా.. ఈ ఏడాది ఆ నిధులు రూ.569.79 కోట్లకు చేరుకుంది.

ప్రాజెక్టు/ఆఫీస్	ఈ ఏడాది	గతేడాది
శ్రీపాదఎల్లంపల్లి	రూ.349.43 కోట్లు	రూ.273.02 కోట్లు
బొగ్గులవాగు(సీఈ)	రూ.32.00 లక్షలు	రూ.65 లక్షలు
మానేరు ప్రాజెక్టు	------	------
శనిగరం (సీఈ)	రూ.65 లక్షలు	-----
వరద కాలువకు	రూ.219.39 కోట్లు	రూ.177.15 కోట్లు
రామడుగు (గోదావరి బేసిన్)	రూ.2.18 కోట్లు	----

జాడలేనివి ఇవే..!

- గతేడాది డిసెంబరు7వ తేదీన జగిత్యాలకు సీఎం కొండగట్టుకు రూ.100 కోట్లు ఇస్తానని ప్రకటించారు. వాస్తవానికి దేవాలయాభివృద్ధికి ప్రభుత్వం దాదాపు 380 ఎకరాలు కేటాయించింది. ఈ బడ్జెట్‌లో రూ.100 కోట్లు ప్రకటిస్తారని ఆశించినా.. దీనిపై స్పష్టత రాకపోవడం భక్తులను నిరాశపరిచింది. అలాగే ధర్మపురి ఆలయాభివృద్ధిపైనా స్పష్టత రాలేదు.
- బసంత్‌నగర్ విమానాశ్రయంపై మొన్న కేంద్ర బడ్జెట్‌లోనూ, తాజాగా రాష్ట్ర బడ్జెట్‌లోనూ ఎలాంటి ప్రకటన రాకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసింది.

సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం



సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇచ్చింది. రైతులు, ఉద్యోగులు, యువత, విద్యార్థులు.. ప్రతిరంగానికీ లబ్ధిచేకూరేలా ఉంది. కాళేశ్వరం టూరిజం సర్క్యూట్‌కు రూ.7,500 కోట్లు కేటాయించడంతో స్థానికులకు ఉపాధి దొరకనుంది. రుణమాఫీ, ఇంటిస్థలం ఉంటే రూ.3లక్షల ప్రకటన బాగుంది.

– కోరుకంటి చందర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

అంకెల గారడీ



అంకెలగారడీ, మాయమాటలు తప్ప ఏమీ లేదు. నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్‌రూంలు, ఇళ్ల స్థలాలు, గిరిజనబంధు ప్రస్తావన లేదు. అన్నివర్గాల ప్రజలను నిరాశలో ముంచేలా ఉంది. ఇంటి స్థలం ఉన్న పేదలకు రూ.5 నుంచి రూ.6లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు రూ.3లక్షలు ఇస్తామనడం మోసం చేసినట్లే.

– విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యే

పొంతనలేని బడ్జెట్



ప్రజలను మభ్యపెట్టేందుకు అంకెల రూపంలో పెట్టారు. బడ్జెట్‌లో చెప్పేదానికి, వాస్తవానికి పొంతన లేదు. విద్యా, వైద్య రంగాలకు సరైన కేటాయింపులు లేవు. నిరుద్యోగ భృతి, డబుల్ ఇళ్ల ప్రస్తావన లేదు. గత బడ్జెట్‌లో హామీలే ఇప్పటికీ అమలు కాలేదు. హామీలతోనే కేసీఆర్ కాలం వెళ్లదీస్తున్నారు.

– సోమారాపు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే

నిరుద్యోగ భృతి ఏదీ..?



నిరుద్యోగ భృతి గురించి బడ్జెట్‌లో ప్రకటించలేదు. జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్‌లు విడుదల చేయక నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పెరిగిన ధరల ఆధారంగా సొంత జాగా ఉన్నవారికి రూ.3లక్షల బదులు రూ.5లక్షలు ఇవ్వాలి.

– తాండ్ర సదానందం, సీపీఐ జిల్లా కార్యదర్శి

విద్య, వైద్యానికి ప్రాధాన్యమేదీ..?



సమాజంలోని ప్రతి పౌరుడికీ కనీసం విద్య, వైద్యాన్ని అందించేందుకు అవసరమైనన్ని నిధులను ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించకపోవడం శోచనీయం. విద్యారంగానికి కేవలం 6.57 శాతం నిధులు, వైద్యరంగానికి 4.19శాతం నిధులు కేటాయిస్తే ఏం సేవలందుతాయో పాలకులకే తెలియాలి.

– దాసరి ఉష, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి

న్యూస్‌రీల్

ప్రజావాణికి 55 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా బాధితులు తరలివచ్చారు. తమ సమస్యలను పరిష్కరించాలని 55 మంది కలెక్టర్ సంగీత, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్‌కు దరఖాస్తులు అందించారు. ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తన పేరిట ఉన్న భూమిని తమ బంధువు పేరిట అక్రమంగా పట్టా చేశారని, ఆ పట్టాను రద్దు పర్చాలని జూలపల్లి మండలం కాచాపూర్‌కు చెందిన గొల్లె లక్ష్మి విన్నవించుకున్నారు. ఇలాంటి సమస్యలతో తరలివచ్చిన బాధితులకు కలెక్టరేట్ కిక్కిరిసిపోయింది.

బహుజనులు ఏకమైతేనే రాజ్యాధికారం



మాట్లాడుతున్న నాయకులు

ఎలిగేడు: బహుజనులు ఏకమైతేనే రాజ్యాధికారం దక్కుతుందని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బాల కళ్యాణ్‌పంజా, జిల్లా అధ్యక్షుడు గొట్టె రాజు అన్నారు. సోమవారం మండలంలోని సుల్తాన్‌పూర, లాలపల్లి, బుర్హాన్‌మియాపేట, ఎలిగేడు, ధూళికట్ట, నర్సాపూర్ గ్రామాల్లో పర్యటించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ బహుజనులకు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుని అధికారంలోకొచ్చాక హామీలు విస్మరించారని ఆరోపించారు. బీసీలకు 52 శాతం రిజర్వేషన్ పెంచాలని, ఇందుకు బీఎస్పీ ఆధ్వర్యంలో కోటి సంతకాలు సేకరిస్తున్నామని వివరించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కాంపెల్లి బాబు, అసెంబ్లీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కోడూరి చంద్రమౌళి, మండల అధ్యక్షుడు మారం సతీష్‌యాదవ్, పూరెళ్ల నరేశ్‌గౌడ్, ముత్యం కనుకయ్య, బీవీఎఫ్ జిల్లా కోకన్వీనర్ బొడ్డు విష్ణు, మండల కన్వీనర్ ఇరుగురాల సాగర్, తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం పరిశీలన



పరిశీలిస్తున్న డాక్టర్ కృపాబాయి

రామగుండం: రామగుండం కార్పొరేషన్ 20వ డివిజన్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో సోమవారం కంటివెలుగు శిబిరాన్ని డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ కృపాబాయి ప్రారంభించారు. కంటి పరీక్షలు చేయించుకునే వారి వివరాలను ఇప్పటికే అంగన్‌వాడీ, ఆశవర్కర్లు, హెల్త్ వర్కర్లు సర్వే చేపట్టారని తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకుడు సలీంబేగ్, డాక్టర్ చేరాలు, వైద్య సిబ్బంది వడ్డెపల్లి సమ్మయ్య తదితరులున్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానులే..



ప్రారంభ కార్యక్రమంలో జడ్జిలు

పెద్దపల్లిరూరల్: చట్టం దృష్టిలో అందరూ సమానులేనని, న్యాయం కోసం వచ్చే పేదలు, మహిళలు, వృద్ధులకు ప్రతివాదుల వాదనలను అర్థం చేసుకుని న్యాయం జరిగేలా సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు అన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంను హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ వర్చువల్ పద్ధతిన సోమవారం ప్రారంభించారు. జిల్లాకేంద్రంలోని న్యాయస్థానంలో జిల్లా జడ్జి నాగరాజు ఈ కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి అర్జున్, జూనియర్ సివిల్ జడ్జి రాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్‌బాబు న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో 935 మందికి లబ్ధి

- మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెరిగిన గౌరవ వేతనం
- గతంలో రూ.వెయ్యి మాత్రమే..
- ప్రస్తుత పెంపుతో రూ.18.70లక్షల మేలు



విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సుల్తానాబాద్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బిల్లులు రాక.. వేతనాలు లేక ఇబ్బంది పడుతున్న మధ్యాహ్న భోజనం కార్మికులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. వారికి నెలకు రూ.3 వేల చొప్పున గౌరవ వేతనం అందిస్తామని మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. వెంటనే అమల్లోకి వస్తుందని వెల్లడించారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ యాజమాన్యాల కింద ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న పథకం అమలవుతోంది. 935 మంది ఎంపిక చేసిన ఏజెన్సీలు పిల్లలకు వడ్డిస్తున్నారు. విద్యార్థులకు సరిపడా బియ్యం ప్రభుత్వం ఇస్తుండగా.. కట్టెలు, కూరగాయలు, ఇతర నిత్యావసరాలు ఏజెన్సీలే సమకూర్చుకుంటున్నాయి. ప్రాథమిక విద్యార్థికి రోజుకు రూ. 5.45, ఆరు నుంచి 8వ తరగతికి రూ. 8.17, తొమ్మిది, పది తరగతి విద్యార్థులకు రూ.10.67 చొప్పున చెల్లిస్తున్నారు. బిల్లులతోపాటు వీరికి గౌరవ వేతనంగా నెలకు రూ.వెయ్యి చెల్లిస్తున్నారు. ఇందులో కేంద్రం వాటా రూ.600, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.400గా ఉంది. అయితే కొంతకాలంగా బిల్లులు, గౌరవ వేతనాలు పెంచాలని ఏజన్సీ సభ్యులు ఆందోళన బాట పట్టారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ గతేడాదే నెలకు రూ.3వేలకు పెంచుతున్నట్లు ప్రకటించినా ఉత్తర్వులు మాత్రం ఇవ్వలేదు. అప్పటినుంచి భోజన కార్మికులు పలుసార్లు ప్రభుత్వానికి విన్నవిస్తూ వస్తున్నారు. తాజాగా రాష్ట్ర బడ్జెట్‌లో గౌరవ వేతనం పెంచుతున్నట్లు ప్రకటించారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 935 మంది మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వీరందరికీ లబ్ధి చేకూరనుంది. మొన్నటివరకు రూ.వెయ్యి చొప్పున రూ.9,35,000 చెల్లించారు. రూ.మూడు వేలకు పెంచితే రూ.28,05,000 అందనున్నాయి. ఇప్పటివరకిచ్చిన రూ.వెయ్యితో పోల్చితే ప్రభుత్వంపై రూ.18,70,000 అదనంగా భారం కానుంది.

పోరాట ఫలితమే..



కార్మికులు గౌరవ వేతనం పెంచాలని చేసిన పోరాటం ఫలించింది. ఏడాదికాలంగా ఆందోళనలు చేపడుతూనే ఉన్నాం. మంత్రి హరీశ్‌రావు బడ్జెట్లో నిధులు కేటాయించడంతోపాటు వెంటనే అమల్లోకి వస్తాయని ప్రకటించడం శుభపరిణామం. – రమేశ్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

పెంపు అభినందనీయం



మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ప్రభుత్వం రూ.మూడు వేల గౌరవ వేతనం ఇస్తామని ప్రకటించడం ఆనందంగా ఉంది. మా కష్టానికి తగినట్లు ఇంకాస్తా పెంచితే బావుండేది. గతంలో ముఖ్యమంత్రి ప్రకటించినప్పటినుంచి బకాయిలు అందించాలి. – భోగ సత్తమ్మ, మధ్యాహ్న భోజనం కార్మికురాలు, నిట్టూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం



లక్ష్మీనగర్‌లో మాట్లాడుతున్న రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగకుండా పోరాడుతున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ స్పష్టం చేశారు. హాత్‌సేహాత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం లక్ష్మీనగర్ ఏరియాలో పర్యటించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రప్రభుత్వం శిలాఫలకాలు, వాట్సప్‌లలో పోస్టింగ్‌లకే పరిమితమైందన్నారు. భూగర్భగనిని ఓసీపీగా మార్చడంతో దుమ్ము, దూళి నగరాన్ని కమ్మేస్తోందన్నారు. ఆయన వెంట ఆయన సతీమణి మనాలీఠాగూర్, నాయకులు బొంతల రాజేశ్, మహంకాళిస్వామి, మారెల్లి రాజిరెడ్డి, ముస్తాఫా, పెద్దెల్లి తేజస్విని, పెద్దెల్లి ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబ పెద్దయితే ప్రగతి భవన్‌కు ఎందుకు రానివ్వరు..?



మల్లాపూర్‌లో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

ధర్మారం: ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రప్రజలకు కుటుంబ పెద్దయితే వారిని ప్రగతి భవన్‌కు ఎందుకు రానివ్వడం లేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా సోమవారం ధర్మారం మండలం నర్సింగపూర్, పత్తిపాక, మల్లాపూర్, కటికెనపల్లి, బంజేరుపల్లిలో పర్యటించారు. మల్లాపూర్‌లో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరూ కుటుంబసభ్యులైనప్పుడు ప్రగతిభవన్‌కు వస్తే ఎందుకు అరెస్ట్ చేయిస్తున్నారని ప్రశ్నించారు. మాయమాటలతో మోసం చేయాలని చూస్తే ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. బీఎస్పీకి పెరుగుతున్న ఆదరణ చూసి బీఆర్‌ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని పేర్కొన్నారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి మద్దెల నారాయణ, నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్, మండల అధ్యక్షుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో ఎన్టీపీసీ ఉద్యోగి మృతి

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ఉద్యోగి సీహెచ్.కొమురయ్య(55) గుండెపోటుతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. సంస్థలోని సీహెచ్‌పీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కొమురయ్య వారం రోజుల క్రితం ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉద్యోగి మృతిపై ఐఎన్టీయూసీ అనుబంధ ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్(గుర్తింపు సంఘం) నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి రమేష్‌నగర్‌కు చెందిన బోడ నర్సింగం(37) సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. నర్సింగం కొంతకాలంగా మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని మృతిచెందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తండ్రి రాజలింగు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

తప్పని పింఛన్ వెతలు

- ట్రస్ట్ సైట్ అప్‌లోడ్‌లో తప్పిదంతోనే ఆలస్యం
- ఎదురు చూస్తున్న 12వేల మంది పెన్షన్ దారులు
- తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిందే: ఇన్‌చార్జి నఫీజ్ అలం



సీఎంపీఎఫ్ కార్యాలయం

గోదావరిఖని: బొగ్గు గని కార్మికులకు పెన్షన్ వెతలు తప్పడం లేదు. జీవన్ ప్రమాణ్‌లో లైవ్ పత్రాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినప్పటికీ డబ్బులు రావడం లేదని చాలామంది రిటైర్డ్ కార్మికులు వాపోతున్నారు. ఇలా రామగుండం సీఎంపీఎఫ్ కార్యాలయం పరిధిలో 12వేల మందికిపైనే పెన్షన్ చెల్లింపులు పెండింగ్ ఉన్నట్లు తెలుస్తోంది. ఏటా డిసెంబర్ చివరి వారం నుంచి జనవరి మొదటివారంలో జీవన్‌ప్రమాణ్ (బతికే ఉన్నట్లు పత్రం) వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అయితే జీవన్‌ప్రమాణ్‌లో అప్‌లోడ్‌లో దొర్లిన తప్పుల మూలంగా రిటైర్డ్ కార్మికుల పెన్షన్ నిలిచిపోతోంది. రామగుండం రీజియన్‌లోని ఆర్జీ-1, 2, 3, ఏపీఏ, భూపాల్‌పల్లి, బెల్లంపల్లి రీజియన్‌లోని బెల్లంపల్లి, శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాలకు చెందిన చాలామంది కార్మికుల పెన్షన్ నిలిచిపోయింది. సింగరేణి సంస్థలో పనిచేసి ఉద్యోగ విరమణ అనంతరం అందించే పెన్షన్ సెటిల్‌మెంట్ కోసం గోదావరిఖని, కొత్తగూడెంలో సీఎంపీఎఫ్ (కోల్‌మైన్స్ పెన్షన్ ప్రావిడెంట్ ఫండ్) ప్రధాన కార్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కార్మికుల ఉద్యోగ విరమణ అనంతరం భర్త చనిపోతే అతడి భార్యకు అందించే పింఛన్ కోసం ఏటా ఏడాది చివరిలో లైవ్ సర్టిఫికెట్ సమర్పించడం తప్పని సరిచేసింది. దీని కోసం జీవన్‌ప్రమాణ్ ప్రత్యేక సైట్ ఏర్పాటు చేసింది. గోదావరిఖని సీఎంపీఎఫ్ కార్యాలయంలో 45వేల మందికిపైగా పెన్షన్‌దారులున్నారు. ఏటా లైవ్ సర్టిఫికెట్ అందించేందుకు తమ సేవింగ్ అకౌంట్ ఉన్న బ్యాంకు బ్రాంచి కార్యాలయం, మీసేవా లేదా నేరుగా సీఎంపీఎఫ్ కార్యాలయంలో అందిస్తున్నారు. ఈసారి చాలామంది జీవన్ ప్రమాణ్ పోర్టల్‌లో సరిగ్గా నమోదు చేసుకోకపోవడంతో వారి పెన్షన్లు నిలిచిపోయాయి. వీరిలో నిరక్షరాస్యులు ఎక్కువగా ఉండటంతో పింఛన్ బ్యాంకు ఖాతాల్లో జమవుతుందో..? లేదో..? కూడా తెలియడం లేదు. దీనిపై సీఎంపీఎఫ్ కార్యాలయం చాలారోజుల ముందునుంచే ప్రచారం చేసినప్పటికీ ఈ విషయం తెలియక రెన్యూవల్ కోసం లైవ్ సర్టిఫికెట్ అందించకపోగా.. మరికొంత మంది పోర్టల్‌లో సరిగా అప్‌లోడ్ చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది.

అప్‌లోడింగ్ ఇలా..

లైవ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు ముందుగా జీవన్‌ప్రమాణ్ పోర్టల్‌లోకి వెళ్లి బ్యాంక్ అకౌంట్ నంబర్, ఆధార్, మొబైల్ నంబర్ ఎంటర్ చేస్తే సెల్‌కు ఓటీపీ వస్తుంది. దాని ఆధారంగా విండోస్‌లో పెన్షన్ సాంక్షనింగ్ అథారిటీ క్లిక్ చేసి సీఎంపీఎఫ్ సెలక్ట్ చేసుకుకోవాలి. ఆ తర్వాత బ్యాంక్ అకౌంట్ నంబర్, పీపీఓ ఎంటర్ చేయాలి. పూర్తి చేసిన డాటాకు సంబంధించిన వివరాలను గోదావరిఖని సీఎంపీఎఫ్ కార్యాలయానికి చెందిన 98660 54594 వాట్సాప్ నంబర్‌కు పంపించాలని అధికారులు సూచిస్తున్నారు.

సరిగా దరఖాస్తు చేసుకుంటేనే..



ఆన్‌లైన్‌లో లైవ్ సర్టిఫికెట్ సరిగా దరఖాస్తు చేసుకుంటేనే పెన్షన్ కొనసాగుతుంది. లేనిపక్షంలో ఆటోమెటిగ్ నిలిచిపోతుంది. చాలామంది ఈపీఎఫ్ సెలక్ట్ చేసుకోవడం లేదు. అందుకే లైవ్ సర్టిఫికెట్ కనిపించడం లేదు. ఏదైనా అనుమానం ఉంటే గోదావరిఖని సీఎంపీఎఫ్ కార్యాలయం ల్యాండ్ ఫోన్ 08728-235522 నంబర్‌కు ఫోన్ చేయవచ్చు. పెన్షన్‌దారులు ఎవరైనా చనిపోతే వెంటనే సమాచారం అందించి పెన్షన్ నిలిపివేయించుకుంటే మంచిది. లేని పక్షంలో రికవరీ చేయడం మిగితా ప్రాసెస్ కోసం ఆలస్యం అవుతుంది.

– సీఎంపీఎఫ్ అధికారి నఫీజ్‌అలం

24 గంటల త్రీఫేస్ కరెంట్ ఇవ్వండి





సుల్తానాబాద్‌లో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రాఘవాపూర్ సబ్‌స్టేషన్ ముట్టడికి తరలివెళుతున్న కాంగ్రెస్ నాయకులు

- పంటలు ఎండిపోకుండా కాపాడాలి
- అదనపు చార్జీలు రద్దు చేయాలి
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా.. వినతిపత్రం అందజేత

సుల్తానాబాద్/పెద్దపల్లిరూరల్: పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ అధికారులు త్రీఫేస్ కరెంటును 24 గంటలు సరఫరా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సుల్తానాబాద్ పట్టణంలోని రాజీవ్ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం పూసాల రోడ్డు వద్ద రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ ఉపేందర్ రావు సంఘటన స్థలానికి చేరుకొని రాస్తారోకో విరమింపచేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ట్రాన్స్‌కో ఏఈ వెంకట్ నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రజల నుంచి విద్యుత్ ఏసీడీ బిల్లులను వసూలు చేస్తున్నారని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మినుపాల ప్రకాష్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ సాయిరి మహేందర్, పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్యగౌడ్, మండల అధ్యక్షుడు చిలుక సతీష్‌కుమార్, కిరణ్, ఎంపీటీసీ మండల రమేష్, రాజు, చక్రధర్, సత్యనారాయణ, పర్శరాములు, పన్నాల రామన్న, రాజలింగు పాల్గొన్నారు.

రాఘవాపూర్ సబ్‌స్టేషన్ ముట్టడి

పంటల సాగుకు అవసరమైన కరెంటు సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. కరంటు ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని, దీంతో పంటలు ఎండిపోయే ప్రమాదముందని సోమవారం పెద్దపల్లి మండలం రాఘవాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గృహ అవసరాలకు వినియోగించే బిల్లులను ఇష్టానుసారంగా పెంచడమే కాకుండా ఏసీడీ పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు నెత్తెట్ల కుమార్‌యాదవ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కొమ్ము శ్రీనివాస్, సంతోష్, తిరుపతిరావు, కుమారస్వామి, మధు, సదయ్య, శ్రీకాంత్, శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులున్నారు.

ఎన్టీపీసీ యాజమాన్యంతో కార్మిక సంఘాల సమావేశం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం యాజమాన్యంతో కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు సమావేశమయ్యారు. సోమవారం ప్రాజెక్టు పరిపాలనా భవనంలోని హాలులో జరిగిన సమావేశంలో 2018 ఒప్పందంలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై చర్చించారు. ఈనెల 8న హైదరాబాద్‌లో జరుగనున్న చర్చలకు సంబంధించిన విషయాలు, సమ్మె జరిగిన క్రమంలో చర్చల ఒప్పందం మేరకు కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా డిపెండెంట్ ఉద్యోగాలు, ప్రమోషన్ పాలసీ పనులకు అంగీకారం కుదరగా, కొత్త ఒప్పందం త్వరలో చేయనున్నామని ఎన్టీపీసీ యాజమాన్యం హామీ ఇచ్చారని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. సమావేశంలో ఎన్టీపీసీ అధికారులు శామ్యూల్ ప్రశాంత్, దీపక్ పాలెక్, కాంట్రాక్టర్లు, జేఏసీ నాయకులు కౌశిక హరి, చిలుక శంకర్, నాంసాని శంకర్, నాగభూషణం, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



యాజమాన్యంతో సమావేశమైన నాయకులు

రాములోరి భూములకే రక్షణ లేదాయే..!

- ఆక్రమించుకుని ఇళ్ల నిర్మాణాలు
- వీహెచ్‌పీ నేతల ఫిర్యాదుతో అధికారుల విచారణ



అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న దేవాదాయశాఖ అధికారి

పెద్దపల్లిరూరల్: రాములోరి భూమికే రక్షణ కరువైంది. జిల్లా కేంద్రంగా మారిన పెద్దపల్లి మార్కెట్ ఏరియాలో విలువైన భూమి కావడంతో అధికార పార్టీ కౌన్సిలర్ అండదండలతో వారి బంధువు ఆలయ భూమిని ఆక్రమించుకుని భవన నిర్మాణాన్ని చేపట్టాడంటూ విశ్వహిందూ పరిషత్ జిల్లా సేవాప్రముఖ్ రాపర్తి గోపి, తదితరులు దేవాదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న అధికారి ముద్దసాని శంకరయ్య కట్టడాలను పరిశీలించి వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఎకరం 4 గుంటలకు మిగిలింది15 గుంటలే..

పెద్దపల్లి పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో గల సర్వే నంబరు 791లో ఎకరం4గుంటల ఆలయ భూమి ఉండాలి. క్రమక్రమంగా ఆలయ భూమి ఆక్రమణల పాలైంది. 2017లో సర్వే చేయించగా 15 గుంటల భూమి మాత్రమే మిగిలిందని ఆలయ ఈఓ శంకరయ్య తెలిపారు. ఆ భూమిని కాపాడేందుకు బోర్డులు పాతించడంతో పాటు సదరు భూమిలో అనుమతులు ఇవ్వొద్దంటూ మున్సిపల్ అధికారులకు లిఖితపూర్వకంగా సమాచారం అందించామని పేర్కొన్నారు. అయినా కొందరు అక్రమార్కులు భవన నిర్మాణ పనులు చేపట్టారన్నారు. అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయించి, సదరు వ్యక్తులు, బిల్డర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని ఈఓ తెలిపారు.

భూమిని కాపాడండి

శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి చెందిన విలువైన భూమిని అధికారపార్టీ ప్రజాప్రతినిధుల అండతో దురాక్రమణకు తెగబడ్డారని విశ్వహిందూ పరిషత్ జిల్లా సేవాప్రముఖ్ గోపి ఆరోపించారు. అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను వెంటనే కూల్చి ఆలయ భూమిని కాపాడాలని, ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితులకు చెక్కు అందజేత

గోదావరిఖని(రామగుండం): ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగాల పేరిట మోసపోయిన ఓల్డ్ హమాలీ లోడర్స్ కో-ఆపరేటివ్ సొసైటీకి చెందిన 120 మందికి రూ.1.10 కోట్ల విలువైన చెక్కును సోమవారం అందించారు. ఉద్యోగం కోసం ఇచ్చిన నగదులో ఒక్కొక్కరికి 45 శాతం చొప్పున అంగీకారం కుదిరింది. ఆ మేరకు రూ.1.10 కోట్ల చెక్కును అఖిలపక్ష కమిటీ సమక్షంలో సబ్ కాంట్రాక్టర్ సొసైటీ సభ్యులకు అందించారు. కాంట్రాక్టర్‌పై పెట్టిన కేసును ఉపసంహరించుకోవడానికి అంగీకరించినట్లు కమిటీ నాయకులు తెలిపారు. కాసిపేట లింగయ్య, దయానంద్ గాంధీ, కార్మిక నాయకులు సీహెచ్.ఉపేందర్, తోట సంతోష్, లాల్ సింగ్, ఎం.చంద్రయ్య, బర్ల సంతోష్, కుసుంబ సురేష్, ఆనంతుల రవీందర్, పల్లెర్ల హరీష్, రామస్వామి, రాజయ్య పాల్గొన్నారు.

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ఎస్సీ నిరుద్యోగ యువతకు గ్రూప్స్‌లో స్పెషల్ ఫౌండేషన్ కోర్సులో మూడునెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఇందుకు ఎంపికైన వారి ధ్రువీకరణ పత్రాలను మంగళవారం పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీకాలేజీలో పరిశీలిస్తారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

త్రీడీ టెక్నాలజీ వినియోగించాలి



మాట్లాడుతున్న జీఎం మనోహర్

- ఆర్జీ-2 జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): త్రీడీ టెక్నాలజీ సమర్థవంతంగా వినియోగించుకుని సంస్థ లక్ష్యాల్లో సమష్టి సహకారం అందించాలని ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్, కార్పొరేట్ సర్వే జీఎం గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక నిమ్‌లో సంస్థ వ్యాప్తంగా ఉన్న 24మంది సర్వేయర్లకు ఆటోకాడ్ సివిల్ త్రీడీ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీపై శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, రెండువారాల పాటు కొనసాగే శిక్షణ తరగతులు సర్వేయర్లకు చాలా కీలకమన్నారు. త్రీడీ టెక్నాలజీతో ఆఫ్ లోడింగ్ ఓబీల్లో లోపాలను తగ్గించడానికి వీలుంటుందన్నారు. కచ్చితమైన సర్వే లెక్కలు, అవసరమయ్యే డ్రాయింగ్ డిజైన్‌లు ఉపయోగించబడుతాయన్నారు. సంస్థ ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి ఈశిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని సంస్థ ఉత్పత్తిలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేట్ డీజీఎం సర్వే రాజేశ్వర్, దయాకర్, సిమ్టార్స్ అధికారులు ఏకేకే శర్మ, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలి



ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

- సింగరేణి భవన్, సీఎల్‌సీ ఎదుట ఏఐటీయూసీ ధర్నా

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని, అప్పటి వరకు అన్ని సంఘాలను చర్చలకు ఆహ్వానించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్, సీఎల్‌సీ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. టీబీజీకేఎస్ యూనియన్ గుర్తింపు కాలపరిమితి ముగిసినందున వెంటనే ఆ యూనియన్ గుర్తింపు రద్దు చేయాలన్నారు. ఎన్నికలు జరిగేంతవరకు అన్ని కార్మిక సంఘాలను చర్చలకు పిలవాలన్నారు. సింగరేణిలో 6వ సారి గుర్తింపు సంఘం ఎన్నికలు 2017 అక్టోబర్ 5న జరిగాయని, టీబీజీకేఎస్ గెలిచిందన్నారు. గుర్తింపు సంఘం అనేక అక్రమాలకు పాల్పడుతూ ఎన్నికల్లో గెలిచిందని ఏఐటీయూసీ యూనియన్ చీఫ్ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా అప్పుడు లేబర్ కమిషనర్ సింగరేణిలో 4 ఏళ్లు ఉన్న కాలపరిమితిని రెండేళ్లకు కుదించారన్నారు. కాలపరిమితి ముగిసి మూడేళ్లు గడిచినా యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదని ఆరోపించారు. ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టుకు వెళ్లగా, మూడు నెలల్లో నిర్వహించాలని సింగరేణి యాజమాన్యానికి, చీఫ్ లేబర్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. కోర్టు తీర్పు గడువు ఈ నెల 28తో ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఇన్‌చార్జి వీఎస్ బోస్, నాయకులు మిర్యాల రంగయ్య, డి.శేషయ్య, ఎల్.ప్రకాశ్, రాజ్‌కుమార్, వైవీ రావు, బాజిసైదా, ఆరెల్లి పోషం, వంగ వెంకట్, సారయ్య, కందుకూరి రాజారత్నం, రంగు శ్రీనివాస్, మాదన మహేష్, మిట్ట శంకర్, బోగ సతీష్‌బాబు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

దొంగల దాడిలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుకు గాయాలు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-1 పరిధి ఏరియా వర్క్‌షాప్‌లో ఆదివారం రెండో షిఫ్ట్‌లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ విషయాన్ని గమనించి అక్కడ విధులు నిర్వహిస్తున్న సాగర్ అనే ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు అడ్డుకునే ప్రయత్నం చేశాడు. ఈక్రమంలో దొంగలు చోరీకి పాల్పడిన సామగ్రిని కాలుపై పడేసి పారిపోయారు. సెక్యూరిటీ గార్డు కాలుకు గాయాలు కావడంతో ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

తప్పిన పెను ప్రమాదం

- లారీ నుంచి ఇంటిగోడపై పడిన గ్రానైట్ బండ
- చిన్నపాటి రాళ్లను ఆనుకుని ఆగిపోయిన వైనం
- ఓవర్ లోడ్, అతివేగమే ప్రమాదానికి కారణమా?



సుల్తానాబాద్ పట్టణంలోని ఓ ఇంటి గోడపై పడిన గ్రానైట్ బండ

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ పట్టణంలోని మసీద్ సమీపంలో ఇంటి గోడపై గ్రానైట్ బండ పడింది. సోమవారం వేకువజామున కదంబాపూర్ నుంచి కరీంనగర్‌కు లారీలో గ్రానైట్ బండను తరలిస్తుండగా మూలమలుపు వద్ద లారీ నుంచి ఎగిరిపడింది. ఇంటి గోడపై పడడంతో భారీ శబ్దం రాగా, ఇంట్లో ఉంటున్నవారు బయటకు పరుగులు తీశారు. గోడ పక్కన చిన్నపాటి బండరాళ్లు ఉండడంతో గ్రానైట్ బండ వాటికి ఆనుకుని ఆగిపోయింది. లేకుంటే ఇంటిపైకి దొర్లి పెద్ద ప్రమాదం జరిగేది. క్వారీల నుంచి బండరాళ్లను లారీల్లో తరలించే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించడం లేదని, ఓవర్ లోడ్‌తో పాటు మూలమలుపుల వద్ద వేగంగా వెళ్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. లారీల్లో ఇసుకను, గ్రానైట్ బండలను ఓవర్‌లోడ్‌గా తరలిస్తున్నా సంబంధిత అధికారులు తనిఖీలు చేయడం లేదని వాపోతున్నారు. ఓవర్‌లోడ్‌తో రోడ్లు దెబ్బతినడంతో పాటు అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొంటున్నారు. ప్రమాదం జరిగినప్పుడే అధికారులు నామమాత్రంగా విచారణ చేసి తర్వాత పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇసుక, గ్రానైట్ లారీలు పట్టణం నడి మధ్యలో నుంచి వెళ్లకుండా బైపాస్ రోడ్డు వేయ్యాలని, ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీలపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నేషనల్ కరాటే టోర్నమెంట్‌లో విద్యార్థుల ప్రతిభ

జ్యోతినగర్(రామగుండం): వరంగల్ జిల్లా నర్సంపేట పద్మశాలీ గార్డెన్‌లో సోమవారం ఇన్విటేషన్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్-2023లో షోటోఖాన్ జపాన్ కరాటే డు ఇండియా అంబు ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పలు రాష్ట్రాలకు చెందిన 2,543 మంది కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్టీపీసీ రామగుండంకు చెందిన జపాన్ షిటోరియో కరాటే స్కూల్ విద్యార్థులు కటాస్, కుమితి విభాగాల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులు, కరాటే కోచ్ శ్రీనివాస్, జపాన్ షిటోరియా కరాటే స్కూల్ ప్రెసిడెంట్ ఎం.రమేష్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్స్ శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, సంజన, అభిజ్ఞ పటేల్, ఇంద్రకరణ్‌రెడ్డి, శిఖశ్రీ, మేఘన, రోహిత్‌కుమార్, నివేదనరెడ్డి, శివకైలాస్‌రెడ్డిలను ఎన్టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రెటరీ బాణేశ్‌రావు, స్పందన క్లబ్ సెక్రెటరీ త్రివేది, చిరంజీవి ఆదిత్య, వంశీ కృష్ణతో పాటు తల్లిదండ్రులు అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులు

ఆలయం ప్రారంభించేందుకు రండి..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడులో నిర్మిస్తున్న నాగలింగేశ్వరస్వామి ఆలయాన్ని ప్రారంభించేందుకు పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీ స్వామిని ఆహ్వానించినట్లు పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ తెలిపారు. ప్రారంభోత్సవంలో పాటించాల్సిన కార్యక్రమాలపై విపులంగా చర్చించినట్లు తెలిపారు. ఆలయ ప్రారంభానికి హాజరయ్యేందుకు సుముఖత వ్యక్తం చేశారని వివరించారు.



భారతిస్వామిని కలిసిన కోలేటి దంపతులు